www.kalamjyothi.com

# కలంజ్యోతి

రేపటి కోసం

ఆదివారం
09.02.2025





- 27 ఏళ్ల తర్వాత ఢిల్లీ కోటపై కాషాయ జెండా
- 70 స్థానాలకు 48 స్థానాలతో ఘన విజయం
- 12 ఏళ్ల ఆమ్ ఆద్మీ పార్టీ పాలనకు ఫుల్‌స్టాప్
- మూడోసారి కూడా ఖాతా తెరవని కాంగ్రెస్
- కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, సత్యేంద్ర జైన్ పరాజయం
- దేశవ్యాప్తంగా బీజేపీ సంబురాలు
- పార్టీ జెండాలతో కార్యకర్తల నృత్యాలు
- పటాకలు కాల్చి స్వీట్లు పంపిణీ చేసిన కార్యకర్తలు

2లో

# ఢిల్లీ పీఠం బీజేపీదే





## మోదీ నాయకత్వంపైనే నమ్మకం

### బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

కలంజ్యోతి, నిర్మల్ : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం.. దేశ ప్రజలు మోదీ నాయకత్వాన్ని బలపరుస్తున్నారన్న దానికి నిదర్శనమని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఖాయమని ఆయన అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రోజు రోజుకూ కాంగ్రెస్ పార్టీ కనుమరుగవుతున్నాదని అన్నారు. గతంలో ఆప్ పార్టీ తప్పుడు హామీలతో, అవినీతి ఆరోపణలు ఎదుర్కొనడంతో ప్రజలు ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పారన్నారు. ఒక్క అవినీతి ఆరోపణ లేకుండా, స్వచ్ఛమైన సుపరిపాలన అందిస్తున్న నరేంద్ర మోదీని దేశ ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. గతంలో తెలంగాణలో రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతితో ఆ ప్రభుత్వాన్ని ప్రజలు ఎలా గద్దె దించారో, ప్రస్తుతం ఢిల్లీ ఎన్నికల్లో కూడా ప్రజలు అలాంటి తీర్పే ఇచ్చారన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో కూడా బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. రాష్ట్రంలో కూడా ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని, గత 10 సంవత్సరాల బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ అవినీతి పాలన మాదిరిగానే కాంగ్రెస్ పాలన కొనసాగుతున్నదని, ప్రజలు కాంగ్రెస్ పార్టీని చీదరించుకుంటున్నారన్నారు. తెలంగాణలో రాబోయేది రామ రాజ్యమే అని ఆయన అన్నారు.




కలంజ్యోతి
ఆదివారం 09.02.2025



## మట్టికరిపించిన అగ్రనేతలు..

అసెంబ్లీ ఎన్నికల్లో వెలివడిన ఫలితాలు ఆప్‌ను ఘోరంగా దెబ్బతీశాయి. టాప్ 3లో ఉన్న అరవింద్ కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా, సత్యేంద్ర జైన్ ఓటమి చవిచూశారు. కేజ్రీవాల్ న్యూఢిల్లీ అసెంబ్లీ నియోజకవర్గంలో 3 వేల పైచిలుకు ఓట్లతో బీజేపీ అభ్యర్థి పర్వేష్ సాహిబ్ సింగ్ వర్మ చేతిలో ఓడిపోయారు. మనీష్ సిసోడియా జంగ్‌పురలో బీజేపీ అభ్యర్థి తర్వీందర్ సింగ్ చేతిలో 600 ఓట్ల స్వల్ప తేడాతో ఓడిపోయారు. షాకుర్ బస్తీలో బీజేపీ అభ్యర్థి కర్నాల్ సింగ్ చేతిలో 19,000 కు పైగా ఓట్ల తేడాతో సత్యేందర్ జైన్ ఓడిపోయారు. ఢిల్లీ సీఎం అతిశీ మాత్రం తన సమీప బీజేపీ అభ్యర్థి రమష్ బిధూరిపై 3,521 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు.



# ఢిల్లీ పీఠం బీజేపీదే

**న్యూ ఢిల్లీ :**

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించింది. 70 అసెంబ్లీ స్థానాల్లో అధికారానికి అవసరమైన మెజార్టీ మార్క్ 36 స్థానాలను సునాయాసంగా దాటేసి 48 స్థానాలను సాధించింది. 22 స్థానాలతో ఆమ్ ఆద్మీ పార్టీ రెండో స్థానంలో నిలిచింది. కాంగ్రెస్ పార్టీ వరుసగా మూడోసారి కూడా ఒక్కసీటు కూడా గెలుచుకోకుండా హ్యాట్రిక్ 'జీరో'లతో చతికిలపడింది. బీజేపీ ఘనవిజయంతో 27 ఏళ్ల తర్వాత ఢిల్లీలో అధికార పగ్గాలు చేపట్టబోతున్నది.

**బీజేపీ వ్యూహాత్మక ప్రచారంతో ఆప్ కు కోలుకోలేని దెబ్బ**

సామాన్యుడినంటూ రాజకీయాల్లోకి వచ్చిన అరవింద్ కేజ్రీవాల్ 2015, 2026లో భారీ అధిక్యతతో అధికారం కొనసాగించగా, ఈసారి ముందస్తు ఎన్నికల ప్రచారం, అభ్యర్థుల జాబితాల విడుదల, మరిన్ని ఉచిత హామీ పథకాలు ప్రకటించినప్పటికీ బీజేపీ వ్యూహాత్మక ప్రచారంతో కోలుకోలేని దెబ్బకొట్టింది. 2025లో టార్గెట్ ఫిక్స్ చేసుకుని మరీ మోదీ, అమిత్‌షా టీమ్ అనుకున్న లక్ష్యం సాధించింది. ఢిల్లీ ఎన్నికలకు ముందే బడ్జెట్‌ను (ఫిబ్రవరి 1)న బడ్జెట్ ప్రవేశపెట్టడం, మధ్యతరగతి వర్గానికి ఊరట కలిగించడం సహా అందుబాటులో ఉన్న అవకాశాలన్నింటినీ బీజేపీ ఉపయోగించుకుంది. దేశంలోనే కేజ్రీవాల్ అంత అవినీతిపరుడు, అబద్ధాలకోరును చూడలేదంటూ లిక్కర్ స్కామ్, శీష్ మహల్ వివాదాన్ని సమర్ధవంతంగా ప్రచారం చేసింది. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటికీ ఢిల్లీలో అమల్లో ఉన్న పథకాలను కొనసాగిస్తామని భరోసా ఇచ్చింది. యమునా జలాల్లో బీజేపీ విషం కలిగిందంటూ కేజ్రీవాల్ చివరి నిమిషంలో చేసిన ఆరోపణలను సైతం అంతే ధీటుగా తిప్పికొట్టింది. అవినీతికి చరమగీతం పాడతామని, అభివృద్ధికి పట్టం కడతామని ప్రజలను భరోసా ఇవ్వగలిగింది. బీజేపీ 'వికసిత్ ఢిల్లీ సంకల్ప్ పత్ర' మేనిఫెస్టో మంత్రం ఢిల్లీ ఓటర్లపై పనిచేయగా, అవినీతి మరకలు, కుంభకోణాలు ఆప్ పార్టీ పాలిట శాపంగా మారాయి. ఎగ్జిట్ పోల్స్‌లో చెప్పినట్టుగానే భారతీయ జనతా పార్టీకి ఢిల్లీ ప్రజలు పట్టంకట్టారు.

**జైలుకు వెళ్లొచ్చిన ఆప్ నేతల ఓటమి**

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో జైలుకు వెళ్లొచ్చిన ఆప్ అధినేత, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా, మాజీ మంత్రి సత్యేంద్ర జైన్ ఓటమి పాలయ్యారు. ఈ ముగ్గురు పోటీ చేసిన స్థానాల్లో బీజేపీ అభ్యర్థులే విజయం సాధించారు.

**సీఎం రేసులో పర్వేశ్ సాహిబ్ సింగ్?**

ఎన్నికల ఫలితాల్లో బీజేపీ మ్యాజిక్ ఫిగర్ దాటి ఎక్కువ స్థానాల్లో విజయం సాధిస్తుండడంతో ఆ పార్టీ సీఎం అభ్యర్థిగా కేజ్రీవాల్‌ను ఓడించిన పర్వేశ్ సాహిబ్ సింగ్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నది. ఈ క్రమంలో ఆయన అమిత్ షాతో భేటీ అవ్వడం ఆసక్తికరంగా మారింది. ముఖ్యమంత్రి రేసులో మనోజ్ తివారీ, విజేందర్ గుప్తా, వీరేంద్ర సచ్‌దేవా పేర్లు కూడా తెరపైకి వస్తున్నాయి. అధిష్టానం ఎవరి పేరు ఖరారు చేస్తుందనేది ఉత్కంఠగా మారింది.

**ఢిల్లీలో కాంగ్రెస్ హ్యాట్రిక్ డకౌట్**

ప్రధాని మోదీ హవా సాగుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ పరాజయాల పరంపర కొనసాగుతున్నది. ఓటముల్లోనూ ఆ పార్టీ కొత్త రికార్డులు హస్తగతం చేసుకున్నది. ఢిల్లీ అసెంబ్లీకి జరిగిన వరుస మూడు ఎన్నికల్లోనూ ఖాతా తెరువకుండా హ్యాట్రిక్ డకౌట్ల అరుదైన రికార్డును సాధించింది. ఢిల్లీ అసెంబ్లీకి 1952-2020 మధ్య ఎనిమిదిసార్లు ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ 4 సార్లు గెలిచింది. అలాంటి పార్టీ ఇప్పుడు అక్కడ ఒక్క స్థానమైనా గెలవలేకపోతున్నది. 2015, 2020 ఎన్నికల్లో సున్నాకే పరిమితమైన గ్రాండ్ ఓల్డ్ పార్టీ ఈ సారి కూడా అదే పేలవ ప్రదర్శన చేసింది. 2025 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లోనూ పూర్తి ఫలితాలు వెలువడగా...కాంగ్రెస్ మరోసారి సున్నాకే పరిమితమైంది. దాంతో హ్యాట్రిక్ డకౌట్ చెత్త రికార్డు కాంగ్రెస్ పార్టీ హస్తగతమైంది



## హత్నూరలో బీజేపీ సంబురాలు

**కలంజ్యోతి, నర్సాపూర్ :** ఢిల్లీలో బీజేపీ భారీ విజయం సాధించడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు దౌల్తాబాద్ తెలంగాణ తల్లి చౌరస్తాలో పటాకాలు కాల్చి, ఆర్టీసి ప్రయాణికులకు మిఠాయిలు పంచి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు నాగప్రభు గౌడ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వానికి తిరుగులేదన్నారు. అవినీతి రహిత పాలన బీజేపీతోనే సాధ్యం అవుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బిట్ల మహేష్, జిల్లా ఉపాధ్యక్షులు రాజమల్లారెడ్డి, అసెంబ్లీ కో కన్వీనర్ ఎర్ర సతీష్, ఎస్సీ మోర్చా నాయకులు కమలాకర్, శంకర్, నాయకులు హన్మంత్, తోట రాజు, రాజేష్, నాగరాజుగౌడ్, మల్లేష్ యాదవ్, మల్లేష్, సాయిరాం, నాగరత్నంగౌడ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## చెన్నారావుపేటలో..

**కలంజ్యోతి, చెన్నారావుపేట :** ఢిల్లీలో జరిగిన అసెంబ్లీ ఎలక్షన్స్ లో బీజేపీ ఘన విజయం సాధించింది. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ సూచనల మేరకు చెన్నారావుపేట మండల కేంద్రంలో మండల అధ్యక్షులు రాజశేఖర్ ఆధ్వర్యంలో పటాకులు పేల్చి స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వనపర్తి మల్లయ్య, రమేష్, బ్రహ్మాచారి, బూత్ అధ్యక్షులు ఎదురుబోయిన వీరేంద్రనాథ్, శ్రీను, రాకేష్ పాల్గొన్నారు.

## ఇల్లంతకుంటలో సంబురాలు

**కలంజ్యోతి, ఇల్లంతకుంట :** ఢిల్లీలో బీజేపీ గెలుపుతో.. ఇల్లంతకుంట మండల కేంద్రంలో బీజేపీ దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడి




హరీష్ ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు నాగ సముద్రాల సంతోష్ మాట్లాడుతూ దేశ రాజధాని ఢిల్లీలో అసెంబ్లీ ఎలక్షన్లో 70 సీట్ల గానూ 48 సీట్లతో బీజేపీ ఘన విజయం సాధించిందన్నారు. తెలంగాణలో జరగనున్న పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎలక్షన్లో బీజేపీ వైపే యువత, ఉపాధ్యాయుల చూపు ఉన్నదన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మేకల మల్లేశం, దేశెట్టి శ్రీనివాస్, అమ్ముల అశోక్, ఇట్టి రెడ్డి లక్ష్మారెడ్డి, పున్ని సంపత్, వజ్జపల్లి శ్రీకాంత్, గజ్జల శ్రీనివాస్ ,లొంకోజు చంద్రం, పెనకాసి అనిల్, దూది సుధీర్, పయ్యావుల బాలయ్య, నాయిని శ్రీనివాస్, కోమటిరెడ్డి అనిల్, గొర్రె అఖిల్, ఎల్క వర్ధన్, వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కలంజ్యోతి 3

ఆదివారం 09.02.2025 Local News




# భక్తుల కొంగు బంగారం..
# భక్త మార్కండేయుడు

**నేటి నుంచి ఐదు రోజులు బ్రహ్మోత్సవాలు**

**కలంజ్యోతి, జగిత్యాల :** పట్టణంలోని నడి బొడ్డున ఉన్న శ్రీ భక్త మార్కండేయ దేవాలయం భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతోంది. సుమారు 50 సంవత్సరాల క్రితం నిర్మించిన ఆ ఆలయం జిల్లా కేంద్రంలో దివ్య క్షేత్రంగా వెలుగుతుంది. 49వ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని పద్మశాలి సేవా సంఘం, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ముస్తాబు చేశారు. కాగా.. భక్త మార్కండేయ దేవాలయంలో గాయత్రీ మాత, భక్త మార్కండేయుడు, సీతారామంజనేయ స్వామి, దత్తాత్రేయుడు, గణపతిస్వామి, ఆంజనేయ స్వామి, కొలువై ఉన్నారు. నిత్యం భక్తులు ఈ ఆలయానికి వస్తూ పూజలు నిర్వహిస్తూ మొక్కలు చెల్లించుకోవడంతో ఆలయం కిటకిటలాడుతూ ఉంటుంది. అయితే ఆదివారం 09 ఫిబ్రవరి 2025 నుంచి ఈ నెల 13వ తేదీ వరకు ఆలయంలో ఐదు రోజుల పాటు వైభవంగా వేడుకలను వేద బ్రామ్మణుల మంత్రోచ్చారణ మధ్య బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసారు. మొదటి రోజు ఆదివారం రోజున ఉదయం 9గంటలకు గణపతి, గౌరీ పూజ, స్వస్తి పుణ్యాహవాచనం, కంకణధారణ, ఋత్విక్ వర్ణనం, నవగ్రహ చతుషష్టి యోగిని, వాస్తుక్షేత్రపాలక, లింగతోభద్ర దేవతల స్థాపన, సాయంత్రం నుంచి ధ్వజారోహణం, అంకురారోపణ, మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణతో ప్రారంభమై సోమవారం ఉదయం 9 గంటలకు స్థాపిత దేవతారాధన, అగ్ని ప్రతిష్ట, గణపతి హవనం, తీర్థప్రసాద వితరణ, మంగళవారం ఉదయ 8గంటలకు స్థాపిత దేవతల పూజ, వేదమాత గాయత్రీ మాతకు పంచామృత అభిషేకం, స్థాపిత దేవత హవనం, మంగళ హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ, సాయంత్రం సామూహిక లలిత సహస్రనామ పారాయణం, డోలోత్సవం, వేద సదస్సు, మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ, బుధవారం ఉదయం 8గంటలకు స్థాపిత దేవతలకు రుద్రాభిషేకం, రుద్ర హవనం, మన్యుసూత్ర పారాయణం, పంచసుక్త హవనం, వసంతోత్సవం, మంగళహారతి, మంతపుష్పం, తీర్థప్రసాద వితరణ, గురువారం ఉదయం 8గంటలకు స్థాపిత దేవతల పూజ, హవనం, బలిహరణం, పూర్ణాహుతి, అన్నప్రసాద వితరణ, నాకబలి, ధ్వజారోహణం, కుంభోద్వాసన, దేవతాప్రోక్షణం, పల్లకి సేవ, ఏకంతసేవ, మహదాశిర్వచనం, ఆచార్య రుత్విక్ సన్మానం కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తుందని పద్మశాలి సేవా సంఘం అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఐదు రోజుల పాటు వేడుకలు బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో భాగంగా దేవాలయంలో ప్రధాన అర్చకులు మేడిపెల్లి శ్రీనివాస్ శర్మ, శ్రీతిగుళ్ల విష్ణుశర్మ, ఆంజనేయశర్మ, ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాల వేడుకలు నిర్వహించనున్నారు.









# కలిసికట్టుగా ముందుకు సాగాలి

- కుత్బుల్లాపూర్ మధ్య, చిన్నతరహ పత్రికల సమావేశంలో పాల్గొన్న జర్నలిస్టులు
- డాక్టర్ ఎల్లంపల్లి సభాధ్యక్షతన పలు తీర్మానాల విజయవంతం
- జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా కొనసాగిన కార్యక్రమం
- సంపూర్ణ మద్దతు తెలిపిన విలేకరుల బృందం


**కలంజ్యోతి, కుత్బుల్లాపూర్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ చిన్న, మధ్య తరగతి పత్రికల విలేకరుల సమావేశం సూరారంలోని వీఐపీ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేశారు. పలు సమస్యలపై చర్చించిన జర్నలిస్టులు చిన్న, మధ్యతరగతి పత్రికల విలేకరుల సంక్షేమ సంఘం ఏర్పాటు చేసిన నాలుగు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. అనంతరం జర్నలిస్టు మిత్రులు హడక్ కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ కమిటీ ప్రతినిధులుగా మాదగారి సుగ్రీవుడు, దప్పు రామస్వామి, గుడుగుల నర్సింగ్ రావు, డా. ఎల్లంపల్లి నర్సింలు, జుట్టు సాయి, కృష్ణ పంతులు, పి. గణేష్, గోపాల్ రెడ్డి, బాన్సువాడ వెంకటేష్, వాసాల బాలరాజ్, ఆకుల రమేష్, రాజమణి, మంజుల రెడ్డి ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు వారిని తోటి జర్నలిస్టులు షాలువాలతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ చిన్న, మధ్య తరగతి పత్రికల జర్నలిస్టుల సంక్షేమం కొరకు నిరంతరం కృషి చేస్తామని అన్నారు. వీరికి స్థానిక కేబుల్ టీవీ అసోసియేషన్ జర్నలిస్టులు మద్దతు తెలిపారు.



# జిల్లా కేంద్రంలో భారీ మోసం

**కలంజ్యోతి, జగిత్యాల :** జిల్లాలో ప్రధానమంత్రి యోజన పథకం పేరుతో భారీ మోసం జరిగింది. ఓ మాయగాడు లోన్లు మంజూరు చేయిస్థానని కోట్లు మూటగట్టుకున్నాడు. వేణువర్మ అనే వ్యక్తి వందల మంది దగ్గర నుంచి కోట్ల రూపాయలు వసూలు చేశాడు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ కు చెందిన వేణువర్మ కొంతకాలంగా జిల్లా కేంద్రంలో ప్రధానమంత్రి యోజన పథకం కింద లోన్లు మంజూరు ఇప్పిస్తానని అమాయక ప్రజలను నమ్మించి నట్టేట ముంచాడు. అమాయక ప్రజలను ఆసరాగా చేసుకుని డబ్బులు, బంగారం, నగదు ఉన్న కాడికి మాయగడికి అప్పజెప్పారు. అయితే లోన్లు ఎన్ని నెలలు అయిన రాకపోవడంతో సదరు వ్యక్తి తప్పించుకొని తిరుగుతున్నాడని బాధితులు పట్టణ పోలీసులను ఆశ్రయించారు. అయితే తిన్ ఖాన్ చౌరస్తా వద్ద వేణువర్మను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. అయితే సుమారు రూ.30 కోట్లకు పైగా వసూలు చేసినట్లు బాధితులు వాపోతున్నారు.





## మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం

**కలంజ్యోతి, చెన్నారావుపేట :** మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన ఎండీ అంకుష్ కొన్ని రోజుల క్రితం అకాల మరణం చెందాడు. అతడి చిన్ననాటి స్నేహితులు కలిసి మృతుడి భార్య ముంతాజ్, కొడుకు ఫిరోజ్ కు రూ.25 వేల ఆర్థికసాయం అందించి వారి కుటుంబానికి మేమున్నాన్న భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో గడ్డం వీరేందర్, నరసింహస్వామి, అల్లి రవి, జూలూరు సతీష్, గుర్రం రాజనర్సింహయ్య, గుడిశాల వెంకటగిరి, గోలి రవీందర్, శెట్టి సదయ్య, డేగల వెంకటరామ్ నరసయ్య, అశోక్, జంపయ్య, దుర్గయ్య, నరేందర్, రాజు, మహేందర్, తదితరులు కార్యక్రమాలు పాల్గొన్నారు.



## తీన్మార్ మల్లన్నపై ఫిర్యాదు

### చర్యలు తీసుకోవాలి: రెడ్డి సంఘం

**కలంజ్యోతి, మల్యాల :** మల్యాల మండల రెడ్డి సంఘం (ఐక్య వేదిక) ఆధ్వర్యంలో శనివారం తీన్మార్ మల్లన్నపై స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. రెడ్డిలపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు ఫిర్యాదు చేసినట్లు సంఘ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేరెళ్ల భూమారెడ్డి, నేరెళ్ళ లింగారెడ్డి, ముదుగంటి రాజు, నేరెళ్ళ శ్రవణ్ రెడ్డి, నేరెళ్ళ సతీష్ రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, బద్దం రాజేశం, తదితరులు పాల్గొన్నారు.



## ముగిసిన క్రికెట్ టోర్నీ

**కలంజ్యోతి, మల్యాల :** మల్యాల మండలంలోని పోతారం గ్రామంలో నిర్వహిస్తున్న స్వర్గీయ వకుళాభరణం శ్రీనివాస్ మెమోరియల్ క్రికెట్ టోర్నీ శనివారం ముగిసింది. విజేత నూకపల్లి, రన్నర్ మద్దుట్ల జట్లకు ఎమ్మెల్సీ ఎల్. రమణ ట్రోఫీలు, ప్రైస్ మనీ అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రామ్మోహన్ రావు, సింగిల్ విండో అధ్యక్షులు సాగర్ రావు, మధుసూదన్ రావు, మిట్టపల్లి సుదర్శన్, మంద తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

# వనమహోత్సవానికి మొక్కలు సిద్ధంగా ఉండాలి

### నిర్మల్ అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



**కలంజ్యోతి, నిర్మల్ :**

వనమహోత్సవం కార్యక్రమం ప్రారంభం నాటికి నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను సిద్ధం చేయాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. దిలావర్ పూర్ మండలంలోని న్యూ లోలం గ్రామంలో ఆయన శనివారం పర్యటించారు. మొదట గ్రామంలోని నర్సరీని సందర్శించి నర్సరీలో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సంవత్సరం వనమహోత్సవ కార్యక్రమం ప్రారంభోత్సవం నాటికి మొక్కలను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఎప్పటికప్పుడు మొక్కలకు నీరును, పోషకాలను అందిస్తూ, మొక్కల ఎదుగుదలను పరిశీలిస్తూ ఉండాలన్నారు. అనంతరం గ్రామంలోని అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న ఆహార పదార్థాలు నాణ్యంగా ఉన్నాయని నిర్వాహకులను అభినందించారు. ఎల్లప్పుడు పిల్లలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. అంగన్వాడీలో పిల్లలను ఆకట్టుకునే విధంగా ఏర్పాటు చేసిన ఆట బొమ్మలు, పెయింటింగ్స్ తదితర సౌకర్యాలపై అంగన్వాడి టీచర్ ను అభినందించారు. అంగన్వాడీ పరిసరాల్లో నిరంతరం మెరుగైన పారిశుద్ధ్యం నిర్వహించాలన్నారు. కార్యక్రమాలలో నిర్మల్ సీడీపీఓ నాగమణి, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు మహేష్, అంగన్వాడీ టీచర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# 362 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

**కలంజ్యోతి, నిర్మల్ :**

నిర్మల్ జిల్లా భైంసా నుంచి తరలిస్తున్న 362 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని భైంసా పోలీసులు పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. కొంతకాలంగా నిర్మల్ జిల్లాలో రేషన్ బియ్యాన్ని పాలిష్ చేసి అక్రమ రవాణా జరుగుతున్నది. కాగా... శుక్రవారం రాత్రి భైంసా నిర్మల్ మార్గంలో నిర్మల్ ఎక్స్ రోడ్డు వద్ద కారు మలుపు తిరుగుతున్న సమయంలో మహారాష్ట్ర వైపు నుంచి నిర్మల్ వైపు వస్తున్న భారీ లారీ కారును ఢీకొంది. ఈ ప్రమాదంపై కారు యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు లారీ డ్రైవర్ ను ఈ విషయంలో ప్రశ్నిస్తే పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో పోలీసులకు అనుమానం వచ్చి ఎస్పీకి సమాచారం అందించారు. స్పందించిన ఎస్పీ జానకి షర్మిల ప్రత్యేక బృందాన్ని భైంసాకి పంపారు. ప్రత్యేక టీం సభ్యులు లారీని తనిఖీ చేసిన క్రమంలో పీడీఎస్ బియ్యాన్ని పాలిష్ చేసి రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ఎస్పీ ఆదేశాల మేరకు మొత్తం 362 సంచుల్లో ఉన్న 36 టన్నుల బియ్యాన్ని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిర్మల్ జిల్లాలో గ్రామాల నుంచి పీడీఎస్ బియ్యాన్ని తక్కువ రేటుకు కొని పాలిష్ చేస్తున్నారన్నారు. జిల్లాలో వీరి ఎత్తుగడలు ఫలించక పోవడంతో మహారాష్ట్రలోని అజ్ఞాత ప్రాంతంలో కొన్ని మిల్లుల్లో ఆ బియ్యాన్ని సన్నగా పాలిష్ చేసి కొన్ని బ్రాండ్ల పేరుతో అమ్మకానికి జిల్లాకి తీసుకు వస్తున్నారన్నారు. ఈ కేసులో ఇంకా లోతుగా విచారణ కోసం భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ ను నియమించామన్నారు. కేసును చాకచక్యంగా వ్యవరించిన ప్రత్యేక టీం పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



## కేసుల మాఫీ కోసమే కేటీఆర్ భజన

### మంత్రి పొన్నం ప్రభాకర్

**కలంజ్యోతి, హైదరాబాద్ :** అధికారంలో ఉన్నప్పుడు చేసిన అవినీతి, అక్రమాలపై నమోదైన కేసులు, జరుగుతున్న విచారణల నుంచి తప్పించుకునేందుకే కేటీఆర్ బీజేపీ వంతు పాడుతున్నారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. 'బీజేపీ గెలిపించినందుకు రాహుల్‌గాంధీకి కంగ్రాట్స్' అంటూ ట్విట్ వేదికగా కేటీఆర్ వ్యంగాస్త్రం సంధించారు. ఆ ట్విట్ కు నిరసనగా మంత్రి పొన్నం ఎక్స్ వేదికగా కౌంటర్ ఇచ్చారు. ఢిల్లీలో కాంగ్రెస్ ఓటమి కన్నా బీజేపీ గెలుపు కేటీఆర్‌కి చాలా ఆనందం కలిగిస్తున్నట్టు ఉందని విమర్శించారు. ఇదంతా కేసుల మాఫీ కోసమే అనే మాట నిజం కాదా? అని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు బీజేపీ అండదండతో ఇష్టానుసారం దోచుకుతిని అధికారం పోయాక కేసుల నుంచి విముక్తి పొదలని బీజేపీ భజన చేస్తున్నారని విమర్శలు చేశారు. దేశాన్ని ఏలుతాము అని పార్టీ పేరు మార్చుకున్న మీ పార్టీ ఢిల్లీ ఎన్నికల సమయంలో ఎక్కడికి వెళ్లిందని ప్రశ్నించారు. ఆనాడు మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే ఇదే విధంగా శునకానందం పొందారని మండిపడ్డారు. ఇప్పటి వరకు బీజేపీబీఆర్ఎస్ పార్టీల బంధం విడదీయలేనిదాని తెలంగాణ ప్రజలందరికీ తెలుసనీ నేడు దేశవ్యాప్తంగా తెలుస్తుందని ఆరోపించారు.

# మీరాలం బ్రిడ్జి డీపీఆర్ 90 రోజుల్లో పూర్తి చేయాలి

## అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు

**కలంజ్యోతి, హైదరాబాద్ :**

మీరాలం చెరువు పై నిర్మించతలపెట్టిన బ్రిడ్జి డీపీఆర్ ను 90 రోజుల్లో పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. వచ్చే 30 నెలల్లో బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావాలని స్పష్టం చేశారు. శనివారం జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో గ్రేటర్ హైదరాబాద్ లో చేపడుతున్న పలు ప్రాజెక్టుల పై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ , జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం పలు అంశాలపై సూచనలు చేశారు. మీరాలం బ్రిడ్జిని హైదరాబాద్ లో అత్యంత ప్రముఖ ప్రాంతంగా తీర్చిదిద్దాలని సూచించారు. చిన్నపిల్లలను దృష్టిలో



ఉంచుకుని బ్రిడ్జి పరిసరాలను రూపొందించాలన్నారు. హైదరాబాద్ లో నిర్మిస్తున్న కొత్త ఫ్లై ఓవర్ల పైనా మరింత లోతుగా అధ్యయనం చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. రోడ్ల వెడల్పు పైనా పలు సూచనలు చేశారు. రెండు రోజుల్లో సమగ్ర సమాచారంతో రావాలని సీఎం అధికారులకు సూచించారు. ఈ సమీక్షలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి,మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ , జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, మూసి రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి , ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు , ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ తో దోస్తానా కేజ్రీవాల్ కొంపముంచింది

## టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

**కలంజ్యోతి, హైదరాబాద్ :** ఢిల్లీ ఎన్నికల ఫలితాలతో ఆప్‌ను కోలుకోలేని దెబ్బ తీశాయని, కేజ్రీవాల్ పతనానికి ప్రధానంగా రెండు కారణాలు కనిపిస్తున్నాయని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటి..కేసీఆర్ సారథ్యంలోని బీఆర్ఎస్ పార్టీతో కేజ్రీవాల్ స్నేహం ఆయన కొంప ముంచిందనే చెప్పాలని విమర్శించారు. కేసీఆర్ కుమార్తె కవితతో కేజ్రీ అండ్ కో లిక్కర్ వ్యాపారం ఆరోపణలు ఆయన పతనానికి పునాదులు వేశాయన్నారు. ఏ అవినీతిరహిత నినాదంతో కేజ్రీవాల్ దేశ స్థాయిలో ఇమేజ్ తెచ్చుకున్నారో దానికి లిక్కర్ స్కామ్ తూట్లు పొడిచిందని ఆరోపించారు. ఆప్‌కు అప్పటి వరకు ఉన్న క్లీన్ ఇమేజ్‌ను లిక్కర్ స్కామ్ ఆరోపణలు ఊడ్చిపారేశాయని తెలిపారు. అవినీతికి కేజ్రీవాల్ అతీతుడు కాదు అన్న అభిప్రాయం ప్రజల్లో కలగడానికి కేసీఆర్ ఫ్యామిలీ కారణమైందన్నారు. రెండు దఫాలు ఢిల్లీని ఏలిన కేజ్రీ పాలనలో లిక్కర్ స్కామ్ తప్ప మరో అవినీతి ఆరోపణ లేదన్నారు. కవిత లిక్కర్ వ్యాపార కాంక్ష కేజ్రీ పార్టీ సిద్ధాంతానికే తూట్లు పొడిచిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీని శత్రువుగా పరిగణించడం తాజా ఢిల్లీ ఎన్నికల్లో కేజ్రీ పతనానికి మరో కారణమన్నారు. కాంగ్రెస్‌తో పొత్తు వద్దు అన్న ఆయన నిర్ణయం బీజేపీ నెత్తిన పాలు పోసిందనే చెప్పాలని వెల్లడించారు. కాంగ్రెస్‌తో కటీఫ్ నిర్ణయంలో హేతుబద్ధత లేదన్నారు. కాంగ్రెస్, ఆప్ విడివిడిగా పోటీ చేస్తే బీజేపీ వ్యతిరేక ఓటు చీలి కాషాయ పార్టీకి మేలు జరుగుతుందన్న చిన్న లాజిక్‌ను కేజ్రీవాల్ తెలిసి మిస్సయ్యారా.. లేక 'అవగాహన'తో చేశారా అన్నది అర్థం కాని విషయమని వివరించారు. కవిత లిక్కర్ స్కామ్‌తో పార్టీ కోర్ ఐడియాలజీనే దెబ్బతీసుకున్న కేజ్రీవాల్.. కాంగ్రెస్‌ను దూరం పెట్టి అధికారాన్ని కూడా కోల్పోయారని చెప్పక తప్పదని వెల్లడించారు.

WANTED విలేఖరులు కావలెను




'కలంజ్యోతి' తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'కలంజ్యోతి' సాదర స్వాగతం పలుకుతోంది. ప్రజలకు, ప్రభుత్వానికి, నాయకులకి మధ్య సమాచార వారధిగా, ప్రజా సమస్యల పరిష్కార దిశగా, పాఠకుల దిక్సూచిగా 'కలంజ్యోతి' పాఠకుల మన్నలను పొందుతున్నది. మరింత నాణ్యమైన వార్త సమాచారాన్ని, వార్త ప్రపంచాన్ని విస్తరించడానికి ప్రజలకు అందించాలనే సంకల్పంతో నియోజకవర్గ, మండలాల వారీగా కంట్రీబ్యూటర్లు నియమించుకోవాలని భావిస్తున్నాము.

సెల్ : 9494 889 883